# ఎదురింట్లో పెండ్లి

"శ్రీ పది రూపాయల నోటు తీసికొని బియ్యం తీసుకు రారాదూ ?" అని సణిగింది మా ఆవిడ వంటింట్లోనుంచి. ఈ ఆడవాళ్ళకు ప్రొద్దున లేచినదగ్గరనుండి బియ్యం, కూరలు, పడక, నిద్ర—అంతే! ఎదురింట్లో పెండ్లిజరుగుతున్నదిగదా, వాళ్లు భోజనానికి పిలుస్తారేమో, వెళ్ళకపోతే బాగుండదే అనే ఊహకూడా లేదు మా ఆవిడకు.

"ఉండవే! నీదంతా ఒక గొడవ! కాసేపు ఉండరాదూ—ఆ యెదురింటి సూర్యనారాయణగారు పెండ్లి భోజనానికి పిలుస్తారేమో!" అన్నాను.

"ఆయన కాకికి కూడా మెతుకులు దులపరు. కనిపెట్టుకోండి పాపం" అంది హేళనగా.

ఈ ఆడవాళ్ళకు కొంచెమైనా లోకజ్ఞానం యెందుకు పెట్టలేదో భగవంతుడు, నాకు అర్థంకాదు. సూర్యనారాయణగారు, నేను మంచి స్నేహితులం. ఎప్పుడు మే మిద్దరం హోటలుకు వెళ్ళినా, నేనే బిల్లు యిస్తాను. చీట్లపేకలో యిద్దరం ఎప్పుడూ ఒకేపార్టీలో ఉంటాము. అదిగాక ఆయనకు యే ఘడియన అప్పు కావాలన్నా నా దగ్గరకే వస్తాడు. ఇంకా ఆయన 15 రూపాయలు బాకీ నాకు! ఇవ్వాళ వాళ్ళ అమ్మాయి పెళ్ళికదా అని మా పరిచయమంతా మరిచిపోయి భోజనానికి పిలవకపోతాడా? కల్ల.

అరుగో సూర్యనారాయణగారు ప్రత్యక్షం.

"రండి! రండి! కూర్చోండి" అన్నాను మర్యాదగా.

"ఎక్కడండీ! కూర్చోటానికి తీరుబడి ఉందా! మా యింట్లో యివ్వాళ పెళ్ళి. కొంచెము మామిడి మండలు కావాలె..."

"ఓస్! యిదేనా? మీ యిష్టం వచ్చినన్ని తీసుకు వెళ్లండి. చెట్టు మొత్తం తీసుకెళ్లినా ఫరవాలేదు. వేరే చెట్టు నాటుతాను" అన్నాను.

"మా వాడిని పంపిస్తానులెండి" అని చరచరా వెళ్ళిపోయినాడు.

"భోజనానికి పిలవటానికి వచ్చినాడా?" అని వంటింట్లోనుంచి సూటి ప్రశ్న.

"ఆఁ! ఆయన హడావుడి మీద ఉన్నాడులే! పాపం ఒక్కడైనాడు. అన్ని పనులూ ఆయనే చూసుకోవాలె కాబోలు."

"మీ పిచ్చి చాలు కాని బియ్యం తీసుకు రండి! పిలవతలచుకుంటే పెండ్లిపత్రికే ఇచ్చేవాడు."

"నిజమే! కాని ఒకటున్నది. ఎదురింట్లో ఉండేవాళ్లకు కూడా పత్రిక లెందుకే! మనిషే వచ్చి చెప్పిపోదాం అనుకున్నాడు కాబోలు."

మళ్లా సూర్యనారాయణగారు ప్రత్యక్షం.

"చెప్పటం మరిచిపోయినాను..."

"చాలపనిమీద ఉన్నారు. అవును లెండి. అర్థం అయింది."

"ఆఁ! ఏమీలేదు. రాత్రికి పెట్రోమాక్సు లైట్లు కావాలె. అవి యెక్కడ అద్దెకు యిస్తారో తెలీదు. మా వాడికి అసలు తెలీదుట."

"అట్లాగా! నేను ఆఫీసుకు వెళ్ళేటప్పుడు కొట్టువాడితో చెప్పుతానులెండి" అన్నాను. మళ్లా ఉడాయింపు.

నిజంగా యీయన భోజనానికి పిలుస్తాడా

## ఆర్. చలపతిరావు

అని అనుమానం వేసింది. కాని, మామిడి కొమ్మలు, పెట్రోమాక్సులైట్లు—కృతజ్ఞత అన్నా చూపకపోతాడా అని ఆశ!

అయినా పోయింది ఏమున్నదీ! పదకొండుగంటలదాకా ఆఫీసుకు వెళ్ళక్కర్లేదు. చూద్దాం అని అట్లాగే కూర్చున్నాను. ఎనిమిది గంటలయింది. ఏమీ లేదు. తొమ్మిది పది. పెండ్లివారు కాబోలు వచ్చారు. సూర్యనారాయణగారియిల్లు చాలాచిన్నది. అందుకని పెండ్లికి వచ్చిన వాళ్ళంతా బయటనే తారట్లాడుతున్నారు. మా అరుగు మీదనే తిష్ట వేశాడు ఒకాయన.

"ఏమండీ! పెండ్లి తరఫు వారా?" అన్నాను, పరిచయం చేసుకుందామని.

"అవునండీ! సూర్యనారాయణగారి వియ్యంకుణ్ణి. మా అబ్బాయికే వాళ్ళమ్మాయిని యిచ్చేది" అన్నాడు.

"అయితే యింకేం? వియ్యంకుడుగారు యిక్కడ కూర్చోటమేమిటి? రండి యింట్లోకి వెళదాం" అని లోపలికి తీసుకు వెళ్లాను.

"మా వియ్యంకుడుగారు మీకు బాగా పరిచయమేనా?" అని అడిగాడు.

"అదేమిటండోయ్! అట్లా అడుగుతున్నారు. మే మిద్దరం స్నేహితులం. ఆయన నాకు అయిదేళ్లనుండి పరిచయం" అన్నాను.

"వాళ్ళకు కాఫీ అలవాటు ఉందా?"

"అదేమిటి? అటువంటి అనుమానం వచ్చింది మీకు?"

"కాఫీ రుచి యెరిగినవారెవరూ అటువంటి బురదనీళ్లు పెళ్లివారికి పంపరు" అన్నాడు కళ్లెర్రజేస్తూ!

"అదేమున్నది లెండి! రకరకాల వారికి రకరకాల కాఫీలు నచ్చవచ్చు. కొంతమందికి స్ట్రాంగ్ కాఫీ కావాలె. పాలు తక్కువ. పంచదార తక్కువ. కొంతమందికి లైట్ కాఫీ అంటే యిష్టం. పాలు యెక్కువ. పంచదార ఎక్కువ. కాఫీ విషయంలో మాత్రం ఒక రూలంటూ లేదు." అయితే మీరు కూడా ఆ బురద నీళ్లే తాగుతారా? అవునులెండి! ఆయన స్నేహితులంటిరిగా?"

"అబ్బెబ్బే! చాల పొరబాటుపడ్డారు. మీరూ మీరూ యేదో బంధువులు కదా అని అన్నాను కాని, ఆయన్ను నేను సమర్థించటం లేదు. మీ కింకా అన్ని


సుగంధికా సరస్వతీ తైలము



మెదడుకు, చల్లదనముకు, కన్ను, ముక్కు, చెవి, వ్యాధులకు, 32 సం॥ నుండి ప్రపంచమంతటా వాడుచున్నారు. ఒకసారివాడిన తెలియును. మీ పెద్దడీలర్లు అందరి వద్ద దొరుకును.

ఈష్టన్ మెడికల్ వర్క్సు, కాకినాడ.

డిస్ట్రిబ్యూటర్లు:
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజెన్సీస్)
విజయవాడ - 1.

# ★ ఎదురింట్లో పెండ్లి ★

విషయాలూ తెలీవు. ఇంత స్నేహితుడిని కదా, నన్ను యీ పెళ్ళికి భోజనానికి కూడ పిలవలేదు ఆయన" అని ఒక బాణం విసిరాను.

"అఁ!" అన్నాడు ఆయన ఆశ్చర్య పోతూ.

"పై పెచ్చు, మా యింట్లో మామిడి చెట్టంతా ధ్వంసం చేశాడు, మండలు కావాలని. ఇంకా పైన ఆయనకు పెట్రొమాక్సు లైట్లు నేను సప్లై చెయ్యాలట."

"ఛా! ఛా! ఆయన్ను స్నేహితుడని పిలవటం నాకు చాలా సిగ్గుగా ఉన్నది."

"నాకూ చాల సిగ్గుగా నే ఉన్నది."

"ఉత్త వెధవన్నమాట."

"అంట్ల వెధవ!" అని నేను సవరించాను.

"ఛా!"

"ఛీ!"

ఆయన హఠాత్తుగా లేచాడు. "ఉండండి! ఈ విషయం యేదో తేల్చుకువస్తాను."

"అఁ! అఁ! వద్దు. వద్దు. ఈయన భోజనం వల్లనే మా కడుపులు నిండుతున్నయ్యా రోజూ! ఏదో మనిషి తత్వం యిదీ అని చెప్పానుగాని యిప్పుడు, ఆయన నను భోజనానికి పిలుస్తే యెంత? పిలవకపోతే యెంత?" అన్నాను.

"కాదు లెండి మీకు తెలీదు" అంటూ పెండ్లివారింట్లోకి పరిగెత్తాడు.

సరే! మనల్ని భోజనానికి పిలవలేదు అన్న సంగతి సూర్యనారాయణగారికి యెరిగించాము. కాని యీ విషయం సవ్యంగా గడిచిపోతుందా? ఈ వియ్యంకుడు చూస్తే ముక్కోపిగా ఉన్నాడు. ఏం గొడవ చేస్తాడో అక్కడకు వెళ్ళి! ఎట్లాగూ పోట్లాట తప్పదు. అయినా యీయన పెళ్ళి భోజనానికి యింత గందరగోళం చేయటం బాగుంటుందా? అసలే వియ్యంకులకు పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటున్నది. ఈ విషయంమీద యెంతకైనా పోతుంది వ్యవహారం! చివరకు నేను పెళ్లి చెడగొట్టిన వాడిని అవుతానేమో అని భయం పుట్టింది. అయినా యీ వ్యవహారం మన చెయ్యి దాటింది. అదుగో అప్పుడే కేకలు వినిపిస్తున్నయి. "వెధవ", "కుక్క వేషాలు" "నీచపు బుద్ధి" అనే మాటలు బాగా వినపడుతున్నవి. హోరాహోరి పోట్లాట జరుగుతున్నది.

ఒక్క క్షణంలో సూర్యనారాయణగారి వియ్యంకుడు గబగబా మా యింట్లోకి వచ్చాడు. నాకేమీ తోచలేదు. "కొంచెము శాంతించండి" అన్నాను మెల్లగా.

"నేను శాంతించటానికి వచ్చిన వెధవను కాను" అన్నాడాయన.

ఒక్క క్షణంలో సూర్యనారాయణగారు కూడ ప్రత్యక్షం. ఆయన వెనకనే పెళ్ళివారు బిక్కమొఖాలతో. "బావగారూ! ఇంత చిన్న విషయంమీద మీకు ఈవిధంగా కోపం వస్తుందని అనుకోలేదు" అన్నాడు జాలిగా నావైపు చూస్తూ. నేను జాలిగా వియ్యంకుడివంక చూశాను.

"ఇది చిన్న విషయమా? నీబోటివాళ్లకు యిది చిన్న విషయం కావచ్చు. ఇంత నీచపు బుద్ధివాడివని నాకు తెలీదు. నేను ఖచ్చితంగా చెబుతున్నాను. ఈ పెళ్ళి అక్కరలేదు" అన్నాడు, నా టేబిల్ గట్టిగా గుద్దుతూ.

ఒహో! అనుకున్నంత పనీ జరిగింది. శ్రుతి మించి రాగానపడ్డది. ఇంత స్వల్ప విషయంమీద—అదీ,—నాకూ, సూర్యనారాయణగారికీ సంబంధించిన విషయం మీద,—ఈయన యింత పట్టుపటడం, పెళ్లి ఆపటం నాకు యిష్టం లేదు. ఈ పోట్లాటకు కారణం నేను కాబట్టి, నేనే దీన్ని సరిదిద్దాలి అనుకున్నాను.

"ఏమండీ! ఇంత చిన్నదాన్ని గురించి పెండ్లి ఆపటం నాకేమీ బాగా లేదు" అన్నాను.

"ఇది చిన్నదిటండీ! దగా!! మోసం!!! 1500 రూపాయలు కట్నం యిసామని, ఒట్టి పగ్గు చూపించి, ప్రామిసరీ నోటు నా జేబులో పెడతాడా?" అన్నాడాయన.

ఒహోయ్! నా విషయం కాదన్నమాట వీళ్లు పోట్లాడుకోవడం! అసలు కట్నందగ్గరే పేచీపడేదన్నమాట!


"రెండురోజుల్లో యిస్తానంటేనికదండీ!" అన్నాడు సూర్యనారాయణగారు యేడుపు ముఖం పెడుతూ.

"రెండు రోజులు కాదుకదా రెండు ఘడియలు కూడ వీల్లేదు. అసలీ పెళ్లే వద్దు. మీ యింట్లో భోజనం కూడా చెయ్యను. ఏమండీ! మీ యింట్లో యీ పూట వంట చేయించండీ!" అన్నాడు నావైపు తిరిగి.

"భోజనానికేమిలెండి" అని వంటింట్లోకి వెళ్లాను "ఆ పది రూపాయల నోటు యెక్కడ పెట్టావే! బియ్యం తేవాలె" అన్నాను మా ఆవిడతో. ★


శుద్ధమైన సువాసనగల మంచి కాఫీ

మీరు సులభంగా కొనగల ధరకు!




స్టేన్స్ ఎఱ్ఱిలేబిల్ ప్యూర్ కాఫీ కోరిన రుచి ఎమేగాక మీకు ఎన్నోకప్పుల కాఫీయగును. ప్రతి కెటిపై స్టేన్స్ పేరుచూచి మరీ కొనండి. పాటెన్యతకు అదే మీ గ్యారంటీ. స్టేన్స్ ఎఱ్ఱిలేబిల్ ప్యూర్ కాఫీ తాజాగా గాలిచొరనట్లు ప్యాక్ చేయబడి శ్రీ. 1, 3, 7, 14&20పౌన్ల టిన్నులలో లభించును.

ప్రతియొక్కరు కొనదగు చక్కని కాఫీ!

ది యునైటెడ్ కాఫీ సప్లై కంపెనీ లిమిటెడ్
కోయంబుత్తూరు, దక్షిణ ఇండియా

ఖమ్మంమెట్టు ఏజెంట్లు. మెసర్సు రాధాకృష్ణ జనరల్ స్టోర్స్, కసాబాగోడ్డు, ఖమ్మంమెట్టు. డిస్ట్రిబ్యూటర్లు: కొత్తగూడెం: మెసర్సు దికొత్తగూడెం కాలరీస్ కోఆపరేటివ్ స్టోర్సు లిమిటెడ్, కొత్తగూడెం.